# 60కి పైగా హక్కులు సాధించాం

- సింగరేణి కార్మికులను ఓటడిగే హక్కు టీబీజీకేఎస్‌కే ఉంది
- టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి



యైటింక్లయిన్‌కాలనీ : గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి

యైటింక్లయిన్ కాలనీ డిసెంబర్ 7 : సింగరేణిలో కార్మికులకు 60కి పైగా హక్కులు సాధించామని, కార్మిక వర్గాన్ని ఓటు అడిగే హక్కు టీబీజీకేఎస్‌కు మాత్రమే ఉందని టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి స్పష్టం చేశారు. గురువారం ఆర్జీ-2 ఏరియాలోని వకీలుపల్లి గనిలో జరిగిన గేట్ మీటింగులో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్మిక వర్గానికి టీబీజీకేఎస్ ఎన్నో హక్కులు సాధించిందని, ఒక్క ఆందోళన కార్యక్రమం కూడా నిర్వహించకుండా 60కి పైగా హక్కులు తీసుకవచ్చిన చరిత్ర టీబీజీకేఎస్‌దేనని స్పష్టం చేశారు. అందుకే కార్మిక వర్గాన్ని ఓటడిగే హక్కు ఒక్క టీబీజీకేఎస్‌కు మాత్రమే ఉందని తెలిపారు. కారుణ్య నియామకాలు, ఎక్స్‌టర్నల్ నోటిఫికేషన్‌ల ద్వారా సుమారు 19 వేలకు పైగా ఉద్యోగాలు ఇప్పించామని తెలిపారు. 190 మస్టర్లు పూర్తి చేసిన వారికి బదిలీ వర్కర్ల నుంచి జనరల్ మజ్దూర్ ప్రమోషన్ ఇప్పించిన ఘనత టీబీజీకేఎస్‌దేని అన్నారు. గతంలో ఉద్యోగానికి దరఖాస్తు చేసుకుంటే ఏడేళ్లు పట్టేదని, పర్మినెంటు కావడానికి 9 సంవత్సరాలు పట్టేదన్నారు. తల్లిదండ్రులకు కార్పొరేట్ వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. ఒక్క శాతం విద్యుత్ చార్జీల రద్దు చేయించామన్నారు. కొన్ని యూనియన్లు టీబీజీకేఎస్ నాయకులపై దుష్ప్రచారం చేస్తున్నారని, అలాంటి వాటిని కార్మిక వర్గం తిప్పికొట్టాలని కోరారు. ఇప్పటికైనా టీబీజీకేఎస్‌ను గెలిపించుకోవాల్సిన అవశ్యకత కార్మిక వర్గంపై ఎంతైనా ఉందని సూచించారు. రాబోయే గుర్తింపు సంఘం ఎన్నికల్లో టీబీజీకేఎస్‌ను గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో డివిజన్ ఉపాధ్యక్షుడు అయిలి శ్రీనివాస్, దేవ వెంకటేశం, మల్లికార్జున్, సంపత్‌రెడ్డి, రాములు, రాకేశ్, సంతోష్, యశ్వంత్, వేగోలపు రాజు, అశోక్, మహేందర్, శ్రీను, వెంకటేశ్, సదయ్య, ఓదెలు, అభి, నాగార్జున పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★కరీంనగర్‌లోని రెనె హాస్పిటల్ ప్రక్కన వున్న వాటర్ ప్లాంట్‌లో పనిచేయుటకు వర్కర్, డ్రైవర్ కావలెను. రూం+భోజనం ఫ్రీ. సంప్ర॥ సెల్ : 7981054327, 7093413912.
NTK-316688
★రామకృష్ణ గ్రూపు (A.P, న్యూఢిల్లీ No.1) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు ఇంటి/వంటపని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లు 12/24 గం.ల డ్యూటీ కొరకు కావలెను. ఏజెంట్లకు 5వేలు కమీషన్. 9281452762, 9515108830.
NT-314474
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లైయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.
Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194

# ఎన్‌హెచ్‌ఆర్‌సీ జిల్లా ఉపాధ్యక్షుడిగా ప్రణయ్



ఇమ్మడి ప్రణయ్‌కి నియామకపత్రం అందజేస్తున్న ఉమ్మడి జిల్లా కన్వీనర్ శ్రీరాముల రమేశ్ తదితర నేతలు

హుజూరాబాద్‌టౌన్,డిసెంబర్ 7: జాతీయ మానవ హక్కుల కమిటీ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) జిల్లా ఉపాధ్యక్షుడిగా ఇమ్మడి ప్రణయ్ నియమితులయ్యారు. హుజూరాబాద్ మండలం కందుగుల గ్రామానికి చెందిన ప్రణయ్‌కు గురువారం ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఉమ్మడి జిల్లా కన్వీనర్ శ్రీరాముల రమేశ్ నియామక ఉత్వర్వులు అందజేశారు. రాష్ట్ర అధ్యక్షుడు మొగుళ్ల భద్రయ్య ఆదేశాల మేరకు ప్రణయ్‌కు బాధ్యతలు అప్పగించామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రణయ్ మాట్లాడుతూ తనకు అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తానని తెలిపారు. తనకు ఈ పదవి వచ్చేందుకు కృషిచేసిన రాష్ట్ర ఉపాధ్యక్షుడు, న్యాయవాది ఉమ్మడి జిల్లా కన్వీనర్ శ్రీరాముల రమేశ్, రాష్ట్ర మీడియా విభాగం కార్యదర్శి సంజీవరావు, జిల్లా అధ్యక్షుడు మాసం సుధాకర్, ప్రధాన కార్యదర్శి విలాసాగరం పృథ్వీరాజ్, జిల్లా అధికార ప్రతినిధి గుంటి స్వరూపకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కందుగుల వార్డ్ మెంబర్ కట్కూరి నాగరాజు, హుజూరాబాద్ మండల కో ఆప్షన్ మెంబర్ ఎండీ హబీబ్ పాల్గొన్నారు.

# నేర విచారణ సమర్థవంతంగా ఉండాలి

- పెండింగ్ కేసులను పరిష్కరించాలి
- జగిత్యాల ఎస్పీ సన్ ప్రీత్ సింగ్
- నెలవారీ నేర సమీక్షా సమావేశం



మాట్లాడుతున్న ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్

జగిత్యాల కలెక్టరేట్, డిసెంబర్ 7: నేర విచారణ మరింత సమర్థవంతంగా ఉండాలని పోలీస్ అధికారులను జగిత్యాల ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ ఆదేశించారు. గురువారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో పోలీస్ స్టేషన్ల పనితీరు, నమోదైన కేసులపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, పోలీస్ స్టేషన్ పనితీరు, కేసుల ఛేదనలో సాధించిన పురోగతిని అంచనా వేసుకుంటూ మరింత దృఢ నిశ్చయంతో పనిచేయాలని అధికారులకు సూచించారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. డీఎస్పీలు, సీఐలు తమ పరిధిలో ఉండే పోలీస్ స్టేషన్లలో నమోదైన వివిధ రకాల కేసులు స్థితిగతులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ సంబంధిత ఎస్‌ఐలకు కేసుల దర్యాప్తునకు సంబంధించి సూచనలు ఇవ్వాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల తో గౌరవంగా వ్యవహరించి సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించే దిశగా కృషి చేయాలని పేర్కొన్నారు. అక్రమ కార్యకలాపాలైన గంజాయి, మట్కా, ఇసుక అక్రమ రవాణా, పేకాట, గుడుంబా, పీడీఎస్ రైస్ రవాణాపై నిఘా ఉంచి దాడులు నిర్వహించి అరెస్ట్ చేయాలని సూచించారు. మెగా లోక్ అదాలత్ దృష్ట్యా పోలీస్ అధికారులు కోర్టు వి ధులు నిర్వహించే కానిస్టేబుళ్లు, పోలీస్ సిబ్బంది రాజీ పడ్డ కేసులను గుర్తించి ఇరు వర్గాల వారిని పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించాలన్నారు. వీసీలో ప్రభాకర్ రావు, భీమ్‌రావ్, డీఎస్పీ రంగారెడ్డి, ఎస్‌బీ, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్లు నాగేశ్వర్ రావు, రాజారెడ్డి పాల్గొన్నారు.

# ఎన్నికల వేళ.. ఆర్టీసీకి కాసుల గలగల

- పెరిగిన రాకపోకలు
- వేములవాడ డిపోకు రూ. 66.21 లక్షల ఆదాయం



వేములవాడ ఆర్టీసీ డిపో

వేములవాడ రూరల్, డిసెంబర్ 7: ఎన్నికల సమయంలో ఆర్టీసీకి అదనపు ఆదాయం చేకూరింది. ముఖ్యంగా నవంబర్ 29, 30 తేదీల్లో ప్రయాణికుల రద్దీతో వేములవాడ డిపోకు రాబడి పెరిగింది. ప్రభుత్వం ఈ రెండు రోజులు సెలవు ఇచ్చింది. దీంతో హైదరాబాద్, వరంగల్ లాంటి పట్టణాల్లో పనిచేస్తున్న ప్రైవేట్ ఉద్యోగులు, వ్యాపారులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఓటర్లు పల్లెలకు వచ్చారు. ఓటేసిన తర్వాత తిరిగి వెళ్లిపోయారు. అలాగే 58 బస్సులను ఎన్నికల సభలకు, సిబ్బందిని తరలించేందుకు వినియోగించారు. ఒక్కో బస్సుకు రోజుకూ రూ. 40 వేల చొప్పున చెల్లించారు. ప్రయాణికులను చేర్చడంతో ఆర్టీసీ బస్సులను అద్దెకు ఇవ్వడంతో రూ.61.21 లక్షల ఆదాయం సమకూరిందని వేములవాడ డిపో మేనేజర్ మురళీకృష్ణ తెలిపారు. ఎన్నికల టైంలో రద్దీ ఉంటుందని అంచనావేసి అందుకు అనుగుణంగా ప్రణాళికలను రూపొందించుకొని బస్సులను నడిపామని చెప్పారు. ఆర్టీసీ అధికారులు, సిబ్బంది అంకితభావంతో పనిచేశారని పేర్కొన్నారు. ఇందుకు సహకరించిన డ్రైవర్లు, కండక్టర్లు ఇతర ఉద్యోగులకు అభినందనలు తెలిపారు.

## చలి ప్రభావం నుంచి నారును కాపాడుకోవాలి

రుద్రంగి, డిసెంబర్ 7: యాసంగిలో చలి ప్రభావం నుంచి నారు మడులను కాపాడుకోవడానికి సస్య రక్షణ చర్యలు చేపట్టాలని రుద్రంగి మండల వ్యవసాయ శాఖ అధికారి విజయ్ గురువారం ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం చలి ప్రభావం ఎక్కువగా ఉండడంతో రాత్రి వేళల్లో నారుమడిలో నీరు నిల్వ ఉంచి తెల్లవారుజామున నీరు తీసివేసి కొత్త నీటిని పెట్టాలన్నారు. సాయంత్రం నీళ్లు తీసివేసి మరల పగటిపూట వెచ్చటి కొత్తనీటిని పెడుతూ ఉండాలన్నారు. నారు మడిలో సేంద్రీయ ఎరువులు, వర్మీకంపోస్టు, గొర్రె లేదా పశువుల ఎరువును 2 గుంటల నారుమడికి 2 క్వింటాళ్లు వేసుకోని కలియదున్నాలన్నారు. దీని ద్వారా నారు త్వరగా ఎదుగుతుందన్నారు. చలికి పోషకాలు మొక్కకు అందకపోవడంతో కొన్నిసార్లు జంకులోపం వల్ల ఆకులపై తుప్పుమచ్చలు ఏర్పడుతాయన్నారు. వాటి నివారణకు 2గ్రాముల జింక్ సల్ఫేట్‌ను, లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. కాండం తొలిచే పురుగు, అగ్గి తెగులు ఆశించకుండా ముందు జాగ్రత్తలు చేపట్టాలని సూచించారు.

## అవార్డుల కోసం దరఖాస్తుల ఆహ్వానం

సిరిసిల్ల కలెక్టరేట్, డిసెంబర్ 7: అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వంతో ఏదైనా రంగంలో ప్రతిష్టాత్మకమైన అవార్డులు పొందిన దివ్యాంగ విద్యార్థులు, ఉద్యోగులు, దివ్యాంగుల కోసం పాటుపడిన స్వచ్ఛంద సంస్థలు, అసోసియేషన్లు అవార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం గురువారం ఒక ప్రకటనలో కోరారు. దివ్యాంగుల కోసం పాటుపడిన స్వచ్ఛంద సంస్థలు, అసోసియేషన్లను రాష్ట్ర స్థాయిలో ప్రభుత్వం తరపున సన్మానించనున్నట్లు తెలిపారు. అవార్డులు పొందాలనుకునే వారు పూర్తి వివరాలతో ప్రభుత్వ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకొని, సంబంధిత ధ్రువపత్రాలతోపాటు ప్రశంసాపత్రాలను జత చేసి జిల్లా సంక్షేమాధికారి, మహిళ, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ కార్యాలయంలో ఈనెల 10లోగా సమర్పించాలని కోరారు. ఇతర వివరాలకు https;//wdsc.telangana.gov.in/ వెబ్‌సైట్‌లో ఉన్న నోటిఫికేషన్‌ను లేదా సంక్షేమాధికారి కార్యాలయం, కలెక్టరేట్‌లో సంప్రదించాలని సంక్షేమాధికారి కోరారు.

## రాష్ట్ర స్థాయి పోటీలకు 'ప్రభుత్వ' విద్యార్థులు

ఎల్లారెడ్డిపేట, డిసెంబర్ 7: వెంకటాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న బాలబాలికలు అండర్-17 ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పీడీ రవికుమార్ తెలిపారు. బాలికల విభాగంలో ఎం. రోషిణి, వంశిక, బాలుర విభాగంలో ఎం. జశ్వంత్, పి. ప్రణయ్, ఎస్.జశ్వంత్ ఎంపికైనట్లు చెప్పారు. అలాగే రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు బొప్పాపూర్‌కు చెందిన శ్రీజ, అథ్లెటిక్స్‌లో హైజంప్ పోటీలకు అండర్-17, అండర్-14కు ముత్యాల మనోజ్, లగిశెట్టి రవికాంత్, దాసరి శ్రీజ ఎంపికైనట్లు పీడీ ప్రభాకర్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మాణిక్యం, ఉపాధ్యాయ బృందం విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

## దాడి కేసులో ఒకరికి రెండేళ్ల జైలు

గాంధీ చౌక్, డిసెంబర్ 7: పొరుగింటి వ్యక్తిపై దాడి చేసిన వ్యక్తికి రెండేళ్ల జైలు శిక్షతో పాటు రూ. 2 వేల జరిమానా విధిస్తూ సిరిసిల్ల ప్రథమ శ్రేణి న్యా యమూర్తి ప్రవీణ్ గురువారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేర కు.. 2016 అక్టోబర్ 4న ముస్తాబాద్ మండలం పోత్గల్ గ్రామానికి చెందిన తలారి రాజు అదే గ్రామానికి చెందిన జంగం భూమరాజు మధ్య చెట్లను కొట్టుకునే విషయంలో వాగ్వాదం జరిగింది. ఆ గొడవలో భూమరాజు రాయితో రాజు తలపై మోదాడు. స్థానికులు రాజును వెంటనే దవాఖానకు తరలించడంతో ప్రాణాపాయం నుంచి బయట పడ్డాడు. కాగా ఘటనపై ముస్తాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ తరపున పీపీ చెలుమల సందీప్ వాదించగా, కోర్టు కానిస్టేబుల్ దేవేందర్ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టాడు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన న్యాయమూర్తి నేరం రుజువు కావడంతో నిందితుడికి శిక్ష విధించారు.

## మోటర్లను చోరీ చేసిన ఒకరి అరెస్టు

కోనరావుపేట, డిసెంబర్ 7: వ్యవసాయ బావుల వద్ద మోటర్ల చోరీకి పాల్పడుతున్న ఆటో డ్రైవర్‌ను అరెస్టు చేయగా, మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. గురువారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోనరావుపేట మండలంలోని మామిడిపల్లిలో ఈనెల 4న పలు బావుల వద్ద ఉన్న మోటర్లను దొంగలు చోరీ చేశారు. దీంతో బాధిత రైతులు పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా ప్రధాన కూడళ్లలో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించారు. రాత్రి సమయాన ట్రాలీ ఆటో వెళ్లినట్లు సీసీ పుటేజీలో గుర్తించారు. ఆటో నంబరు ఆధారంగా ఆరా తీసిన పోలీసులు, ఆటో డ్రైవర్‌ను, ఆటోను ఠాణాకు తరలించారు. ఆటో డ్రైవర్‌ను విచారించగా, అదే గ్రామానికి చెందిన ఇద్దరు యువకులతో కలిసి బావికి ఉన్న మోటరు, పైపులను దొంగలించినట్లు నేరాన్ని అంగీకరించాడు. దీంతో ఆటో డ్రైవర్‌ను అరెస్టు చేశారు. పరారీలో ఉన్న మరో ఇద్దరిని కూడా త్వరలోనే అరెస్టు చేస్తామని ఎస్ఐ తెలిపారు.